ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

శనివారం 21 సెప్టెంబరు 2024





అధికారులు పట్టుకున్న ఓవర్‌లోడ్ బూడిద వాహనాలు

మళ్లీ రోడ్డెక్కిన బూడిద లారీలు

- ఓవర్‌లోడ్‌తో రాత్రి వేళల్లో రవాణా
- ఒక్కో లారీలో 50 నుంచి 60 టన్నుల బూడిద తరలింపు
- రోడ్డుపై పడుతున్న బూడిదతో వాహనదారుల ఇక్కట్లు
- 21 లారీలను పట్టుకున్న ఆర్‌టీఏ అధికారులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

మళ్లీ ఓవర్‌లోడ్‌తో బూడిద లారీలు రోడ్డెక్కాయి. ఓవర్‌లోడ్‌తో బూడిద తరలింపుపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో నెలరోజుల పాటు రవాణా నిలిచిపోగా, తాజాగా వారం రోజుల క్రితం నుంచి మళ్లీ బూడిదను తరలించడం ప్రారంభించారు. అధికారుల కళ్లు గప్పి రాత్రిపూట యథేచ్ఛగా ఓవర్‌లోడ్‌తో బూడిదను తరలిస్తున్నారు. మార్గమధ్యలో లారీల నుంచి తెప్పలుతెప్పలుగా రాలుతున్న బూడిద రహదారిపై వెళుతున్న వాహనదారుల కళ్లల్లో పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లాలోని రామగుండం ఎన్టీపీసీలో బొగ్గు ఆధారితంగా విద్యుత్ ఉత్పత్తి అవుతున్నది. బొగ్గు కాల్చడం వల్ల వెలువడే బూడిద కోసం కుందనపల్లి వద్ద 500 ఎకరాల్లో యాష్ పాండ్‌ను నిర్మించారు. దీంట్లో పెద్ద ఎత్తున బూడిద నిల్వలు ఉన్నాయి. ఈ పాండ్ నుంచి సింగరేణికి ఉచితంగా బూడిదను తరలించుకుపోతున్నారు. భూగర్భ గనుల్లో బొగ్గును వెలికితీసిన తర్వాత వాటిని బూడిదతో నింపుతున్నారు. జాతీయ రహదారుల నిర్మాణంలో పెద్దఎత్తున బూడిదను వాడుతున్నారు. సింగరేణి, జాతీయ రహదారులకు బాటమ్ యాష్‌ను వినియోగిస్తున్నారు. 2028 నాటికి యాష్ పాండ్‌లో బూడిదను అంతా ఖాళీ చేసేందుకు గ్రీన్‌ఫీల్డ్ హైవే(జాతీయ రహదారులు)ల నిర్మాణంలో బాటమ్ యాష్‌ను వాడాలని నిర్ధేశించింది. ఆ మేరకు ఎక్కడైతే జాతీయ రహదారులను నిర్మిస్తున్నారో, దానికి సమీపంలోని పవర్ ప్లాంట్‌ల నుంచి ఉచితంగా బాటమ్ యాష్‌ను తీసుకునేందుకు వెసులుబాటు కల్పించింది. దీంతో ఖమ్మం జిల్లాలో నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవేల నిర్మాణాల కోసం జిల్లాలోని కుందనపల్లిలోగల ఎన్టీపీసీ యాష్ పాండ్ నుంచి గత ఐదు మాసాల నుంచి బూడిదను తరలిస్తున్నారు. ఇక్కడి నుంచి దాదాపు 200 నుంచి 250 కిలోమీటర్ల దూరం వరకు పెద్ద పెద్ద లారీల్లో బూడిదను తరలిస్తున్నారు. ఒక్కో లారీలో నిబంధనలకు విరుద్ధంగా 50 నుంచి 60 టన్నుల వరకు బూడిదను తరలిస్తున్నారు. రవాణా చార్జీల భారాన్ని తగ్గించుకునేందుకు లారీల వాహనాల బాడీని మరింత ఎత్తుకు పెంచి వాటి సామర్థ్యానికి మించి ఒక్కో లారీలో 20 నుంచి 30 టన్నుల బూడిదను అదనంగా తీసుకవెళుతున్నారు.

వారం రోజుల నుంచి..

కుందనపల్లి యాష్ పాండ్ నుంచి బసంత్‌నగర్, పెద్దపల్లి కరీంనగర్ బైపాస్ హుజూరాబాద్, వరంగల్ మీదుగా ఖమ్మం, సూర్యాపేట జిల్లాలకు బూడిదతో లారీలు వెళుతున్నాయి. రెండు మాసాల క్రితం హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి బూడిద లారీలను హుజూరాబాద్ సమీపంలో నిలిపివేశారు. ఎన్టీపీసీ బూడిదను నేషనల్ హైవే కోసం బూడిదను ఉచితంగానే ఇస్తున్నప్పటికీ, కాంట్రాక్టర్లు మాత్రం ఓవర్ లోడ్‌తో తరలిస్తున్నారు. మూడు వాహనాల్లో తరలించే బూడిదను రెండు వాహనాల్లోనే తరలిస్తున్నారు. దీంతో రోడ్లపై తీవ్ర భారం పడుతున్నది. స్పీడ్ బ్రేకర్లు, బొందలు, రోడ్లు దెబ్బతిన్న చోట్ల బూడిద వాహనాల్లోంచి తెప్పలుతెప్పలుగా పడుతున్నది. దీంతో ఆ బూడిద అంత గాలికి లేచి ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర లారీలు, వ్యాన్లు, బస్సుడ్రైవర్ల కళ్లలో పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అక్కడక్కడా చిన్నచిన్న ప్రమాదాలు కూడా జరిగాయి. దీంతో ఓవర్‌లోడ్‌పై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో అధికారులు వాటిపై కొరఢా ఝుళిపించారు. దీంతో నెలరోజుల పాటు రవాణా నిలిచిపోయింది. వారం రోజుల క్రితం నుంచి మళ్లీ ప్రారంభించారు. రాత్రివేళలో ఓవర్ లోడ్‌తో బూడిదను తరలిస్తున్నారు. ప్రతి రోజు యాష్ పాండ్ నుంచి 100 నుంచి 150 బూడిద లారీలు వెళుతున్నట్లు సమాచారం. అప్పన్నపేట ఫ్లైఓవర్ సమీపంలో లారీల డ్రైవర్లు పక్కన నిలపడం వల్ల రోడ్ సైడ్ బర్ములు గుంతలుపడ్డాయి. వాహనాలను నిలిపిన చోట కూడా రోడ్డుపై బూడిద పడుతున్నది. ఓవర్‌లోడ్ రవాణాపై ఫిర్యాదులు రావడంతో రెండు రోజుల నుంచి రవాణా శాఖాధికారులు నిఘా పెట్టారు. గడిచిన రెండు రోజుల్లో రాత్రి వేళలో ఓవర్‌లోడ్‌తో వెళుతున్న 21 వాహనాలను ఆర్‌టీవో రంగారావు పట్టుకుని కార్యాలయానికి తరలించి ఓవర్‌లోడ్‌పై కేసులు నమోదు చేశారు. ఓవర్‌లోడ్‌తో వెళ్లే ఏ వాహనాన్నైనా సీజ్ చేస్తామని, ఓవర్‌లోడ్‌ను సహించేది లేదని రంగారావు హెచ్చరించారు.

ఇందిరా మహిళా శక్తి యూనిట్ల గ్రౌండింగ్ చేయాలి : కలెక్టర్

పెద్దపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరా మహిళా శక్తి యూనిట్ల గ్రౌండింగ్‌కు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి ప్రోగ్రాం అమలుపై నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ మహిళలు పాడిపశువులు, మీసేవా కేంద్రాలు, కుటీర పరిశ్రమలు, పౌల్ట్రీ, ఆహారశుద్ధి కేంద్రాలు, సోషల్ మొబిలైజేషన్ తదితర వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు అవసరమైన సలహాలు ఇతర సహాయ సహకారాలను జిల్లా యంత్రాంగం అందిస్తుందన్నారు. జిల్లాలో మొత్తం 8569వ్యాపార యూనిట్ల ఏర్పాటు లక్ష్యంకాగా ఇప్పటి వరకు 3791 యూనిట్ల ఏర్పాటు చేశామన్నారు. ఇందులో 2156 కుటీర పరిశ్రమలు, 6 ఆహార శుద్ధి కేంద్రాలు, 141 పౌల్ట్రీ యూనిట్లు, 4 పౌల్ట్రీ మదర్ యూనిట్లు, 1484 సోషల్ మొబిలైజేషన్ యూనిట్ల ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల మేరకు అమ్మ క్యాంటీన్లు, మీసేవ కేంద్రాలు, పాడి పశువుల యూనిట్లు మహిళా సంఘాల ద్వారా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద గ్రౌండ్ చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి రవిందర్ రాథోడ్, అదనపు గ్రామీణ అభివృద్ధి అధికారి రవికుమార్, డీపీఎం, ఏపీఎంలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పక్కా ప్రణాళికలతో ఖరీఫ్ ధాన్యం కొనుగోలు చేయాలి

పెద్దపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): పక్కా ప్రణాళికతో ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించే వరి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సీజన్‌లో సుమారు 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయన్నారు. మొత్తం 311 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని ఆదేశించారు. కేంద్రాల్లో తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, వేయింగ్ మిషన్లు, టార్పాలిన్లు సిద్ధం చేసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, డీఏవో ఆదిరెడ్డి, డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, డీఎస్‌వో రాజేందర్ పాల్గొన్నారు.

బఫర్ జోన్‌లో రియల్ వెంచర్.. గుర్తించిన అధికారులు



గుండమ్మ చెరువులో ఎఫ్‌టీఎల్ వరకు గుర్తిస్తూ అధికారులు పాతిన ఎర్రజెండా..

పెద్దపల్లి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి పట్టణంలోని గుండమ్మ చెరువు శిఖంను ఆనుకుని వెలసిన రియల్ ఎస్టేట్ వెంచర్ బఫర్‌జోన్‌లో ఉన్నట్లు తేలింది. కొందరు రియల్ వ్యాపారులు ఒక వెంచర్‌ను ఏర్పాటు చేశారు. అయితే రియల్ వ్యాపారులు చెరువులోనికి చొచ్చుకుని వచ్చి చెరువు భూమిని ఆక్రమించారని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు రంగంలోకి దిగారు. దీంతో రియల్ వ్యాపారులు సొంతంగా కంపౌండ్ వాల్ గోడలను స్వయంగా తొలగించుకున్నారు. శుక్రవారం రెవెన్యూ, నీటిపారుదల శాఖాధికారులు గుండమ్మ చెరువు శిఖం భూమిని ఆధునిక యంత్రంతో కొలిచారు. రియల్ వెంచర్ కంపౌండ్ వాల్ వరకు ఎఫ్‌టీఎల్‌ను నిర్ధారించి ఎర్ర జెండాలను పాతారు. ఈ చెరువుకు బఫర్ జోన్ 9 మీటర్ల వరకు ఉంటుందని, వెంచర్‌లో కొంత భాగం బఫర్ జోన్‌లో ఉందని గుర్తించి కంపౌండ్ వాల్ నిర్మాణానికి పాతిన సిమెంట్ స్థంభాలను తొలగించాలని రియల్ వ్యాపారులను ఆదేశించారు.

కుల గణన మార్చ్ మహా ర్యాలీ కరపత్రాల ఆవిష్కరణ

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 20: బీసీ కులగణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్‌ను అమలు చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు శుక్రవారం పెద్దపల్లి పట్టణంలో కులగణన మార్చ్ మహా ర్యాలీ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు పెంచాలని ప్రధాన డిమాండ్‌తో ఈనెల 25న సుందరయ్య విజ్ఞాన భవన్ నుంచి ఇందిరా పార్క్ వరకు కులగణన మార్చ్ మహా ర్యాలీ జరగనున్నదని, దీనిని విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కన్న రమేష్ గౌడ్ జిల్లా ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లక్ష్మణ్, బక్కయ్య, జిల్లా అధికార ప్రతినిధి కంకటి శ్రీనివాస్, బీసీ ఉపాధ్యక్షులు తోట రాజ్ కుమార్ సుల్తానాబాద్ బీసీ సంఘం మండల అధ్యక్షుడు ఆసరి రాజయ్య యాదవ్, బండారి మల్లయ్య, దర్శనాల మల్లేశం, ఇందారం శంకరయ్య, సాగర్, తదితరులు పాల్గొన్నారు.

బీసీ డిక్లరేషన్ అమలుచేయాలని ధర్నా

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 20:అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన కామారెడ్డి బీసీ డిక్లరేషన్ తక్షణమే అమలు చేయాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు నోమూరి శ్రీధర్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా నోమూరి శ్రీధర్ మాట్లాడుతూ కులగణన చేపట్టి స్థానిక సంస్థల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మల్యాల సంజీవ్‌గౌడ్, అలువాల రాజేందర్, రంగు రాజేశం, నారగోని శివకుమార్‌గౌడ్, వేల్పుల నాగసూర్య, మేకల సాయి ప్రణయ్, కొక్కుల అభినయ్, దాసరి శ్రీనివాస్, అడ్డగుంట అభిలాష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 20: పెద్దపల్లి పట్టణం (గుండమ్మ కట్ట) సబ్‌స్టేషన్‌లో నెలవారి మరమ్మతుల కారణంగా ఈనెల 21వ తేదీన ఉదయం గంటసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏడీఈ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. చందపల్లి, నిట్టూర్, నిమ్మనపల్లి, పెద్దపల్లిలోని చింతలవాడ, తెనుగువాడ, మజీద్ ఏరియా, అమర్‌నగర్, మిషన్ కాంపౌండ్ ఏరియా, టీచర్స్ కాలనీ, శాంతినగర్, హనుమాన్‌నగర్, బస్ స్టాండ్ ఏరియా, తిలక్‌నగర్, సాగర్ రోడ్, జెండా చౌరస్తాలలో ఉదయం 9 గంటల నుంచి 10 గంట వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

మార్కండేయకాలనీ: గోదావరిఖని సబ్‌డివిజన్ పరిధిలో 3వ శనివారం సందర్భంగా ఉదయం 9గంటల నుంచి 10.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ అడిచర్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌డివిజన్ పరిధిలోని రాంమందిర్ ఏరియా, గౌతమినగర్, జనగామ, పీజీ సెంటర్ ఏరియాల్లో 33కేవీ లైన్లు, సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులను నిర్వహించనున్నట్లు తెలిపారు.

మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచాలి

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 20: మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం పెద్దపల్లి మున్సిపల్‌ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించి అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యంరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సావనపల్లి వెంకటస్వామి, పెద్దపల్లి మున్సిపల్ యూనియన్ అధ్యక్షుడు మహంకాళి సురేష్, ప్రధానకార్యదర్శి బొంకూరి సాగర్, నాయకులు కుక్క అన్వేష్, సుద్దాల సతీష్, మద్దెల రాజయ్య, బదుగు అంజయ్య, బొంకూరి శంకర్, గుండేటి లక్ష్మి, మామిడిపల్లి శ్రీనివాస్, బదుగు శ్రీనివాస్, ఆరేపల్లి ప్రమీల, నలిగంటి సుశీలతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

మంథనిలో..

మంథని, సెప్టెంబరు 20: సమస్యలు పరిష్కరించాలని కార్మికులు మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ మేరకు మున్సిపల్ చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈకార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు బూడిద గణేష్, కార్మికులు చిప్పకుర్తి చందు, సింగారపు గట్టయ్య, రాజయ్య, కమల, పోశమ్మలు పాల్గొన్నారు.

రామగుండంలో..

కోల్‌సిటీ, సెప్టెంబరు 20: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కమిషనర్ శివానంద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాధాకృష్ణ, కిషన్‌నాయక్, వీ నాగమణి, సారయ్య, సత్యం పాల్గొన్నారు.

సింగరేణి కార్మికులకు 33శాతం లాభాల వాటా

- ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి - రూ.796కోట్లు కార్మికులకు.. - కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేలు - దసరాలోపే చెల్లింపు

గోదావరిఖని, సెప్టెంబరు 20: సింగరేణి కార్మికులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దసరా కానుకగా లాభాల వాటా ప్రకటించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2,412కోట్లు లాభంగా యాజమాన్యం ప్రకటించింది. ఈ లాభాల్లో 33శాతం దామశగా రూ.796కోట్లు సింగరేణి కార్మికులకు లాభాల వాటాగా పంపిణీ చేయనున్నారు. సగటున ఒక్కో కార్మికునికి రూ.1.9లక్షలు లాభాల బోనస్ రానున్నది. దసరాలోపే ఈ బోనస్ కార్మికులకు అందేలా కూడా సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవతో 25వేలమంది కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు లాభాల్లో వాటాను కూడా ప్రకటించారు. ఇది సింగరేణి చరిత్రలో మొదటిది. ఒక్కో కాంట్రాక్టు కార్మికునికి రూ.5వేల చొప్పున ఈ బోనస్ ఇవ్వనున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశ అనంతరం సహచర మంత్రులతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి సింగరేణి లాభాల వాటాను ప్రకటించారు. ఈ ప్రకటన పట్ల కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు,మంత్రులు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో 70మిలియన్ల బొగ్గు ఉత్పత్తి నికర లాభం రూ.4,701కోట్లు సింగరేణి ఆర్జించింది. ఇందులో రూ.2,412కోట్లు లాభాలుగా ప్రకటించి అందులో 33శాతం కార్మికులకు లాభాల వాటా ఇచ్చారు. నికర లాభాల్లో మిగిలిన రూ.2,289 కోట్లతో సింగరేణి భవిష్యత్ కార్యాచరణ, వ్యాపార విస్తరణ కోసం కేటాయించింది. గత సంవత్సరంకన్నా కార్మికులకు లాభాల వాటా ప్రయోజనాలు రూ.85 కోట్లు అధికంగా ఉన్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరంలో లాభాల వాటా 32శాతం కార్మికులకు అందజేశారు.అప్పటి లాభాల్లో రూ.711 కోట్లు కార్మికులకు లాభాల వాటా కింద చెల్లించారు. ఇప్పుడు లాభాల వాటాలో 1శాతం పెంచడంతో పాటు లాభాలు కూడా ఎక్కువ రావడంతో కార్మికులకు మరింత ప్రయోజనం జరిగింది. గత సంవత్సరం సగటున ఒక్కో కార్మికునికి రూ.1.7లక్షలు రాగా ఇప్పుడు రూ.1.9లక్షల ప్రయోజనం జరుగుతున్నది. సింగరేణికి లాభాలు కూడా ఎప్పుడూ లేనంతగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.4,701కోట్లు కంపెనీ ఆర్జించింది. 1990 దశకంలో తీవ్ర నష్టాల్లో ఉన్న సింగరేణి సంస్థను కార్మికులు, అధికారులు సమష్టిగా కృషిచేసి లాభాల వాటా పట్టించారు. ఆ నేపథ్యంలో లాభాల్లో కార్మికులకు వాటా ఇస్తూ ప్రోత్సహించారు. 1999-2000సంవత్సరంలో రూ.30కోట్ల లాభాలు ఆర్జించిన సింగరేణి 10శాతంతో రూ.30కోట్లను లాభాల వాటాగా కార్మికులను అందించింది. అప్పుడున్న 1.08లక్షల మంది కార్మికులకు ఒక్కొక్కరికి సగటను రూ.2,782 లాభాలవాటా అందింది. సంస్థ లాభాల్లో కార్మికులకు వాటా చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వరంగ సంస్థగా సింగరేణి దేశంలో నిలిచింది. 2000 సంవత్సరం నుంచి 23ఏళ్లుగా సింగరేణి సంస్థ లాభాల్లోనే కొనసాగుతున్నది. ఈ నేపథ్యంలో కార్మికులకు లాభాల వాటా శాతం కూడా పెరుగుతూ వస్తున్నది. మస్టర్లు అధికంగా ఉన్న కార్మికులకు ఇప్పుడు ప్రకటించిన 33శాతం లాభాల వాటా గరిష్టంగా రూ.2.5లక్షల వరకు రానున్నది. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్టు ఒప్పంద కార్మికులకు కూడా లాభాల బోనస్ రూ.5వేల చొప్పున సింగరేణి అందించనున్నది.



సింగరేణి లాభాల వాటాను ప్రకటిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ముఖ్యమంత్రి లాభాల వాటా ప్రకటించిన సందర్భంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్ రావు, జూపెల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, కొండ సురేఖ, సీతక్క, ప్రభుత్వ సలహాదారు హర్కార వేణుగోపాల్ రావు, కోల్‌బెల్ట్ ప్రాంత ఎమ్మెల్యేలు మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్, వివేక్, వినోద్, ప్రేమ్‌సాగర్ రావు, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, సింగరేణి సీఎండీ బలరాం, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రాతినిధ్య సంఘం నాయకులు జనక్‌ప్రసాద్, అధికారుల సంఘం నాయకులు, జీఎంలు సుభాని, రవి ప్రసాద్ పాల్గొన్నారు.

గోదావరిఖనిలో కాంగ్రెస్ నాయకుల సంబరాలు



స్వీట్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 20: సింగరేణి కార్మికులకు 33శాతం లాభాల వాటా, కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల బోనస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని హర్షిస్తూ శుక్రవారం రాత్రి గోదావరిఖని చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. ఈసందర్భంగా కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేటర్ మహంకాళి స్వామి, సీనియర్ నాయకుడు కాల్వ లింగస్వామి మాట్లాడుతూ సింగరేణి సంస్థకు వచ్చిన లాభాల్లో 33 శాతం వాటా చెల్లించడం హర్షణీయమని, సింగరేణి చరిత్రలో లేని విధంగా కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల బోనస్‌ను ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రామగుండంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం, జెన్‌కో స్థానంలో 800మెగావాట్ల విద్యుత్‌ప్లాంట్, సింగరేణి హాస్పిటల్‌లో క్యాత్ ల్యాబ్, ఓసీపీ-4లో సంప్‌డ్ పవర్ ప్రాజెక్టుతో పాటు ఎన్‌టీపీసీలో మరో మూడు 800మెగావాట్ల యూనిట్ల స్థాపనకు ముఖ్యమంత్రి గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షనీయమన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తిప్పారపు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, బొమ్మక రాజేష్, కొప్పుల శంకర్, ఫజల్ బేగ్, చుక్కల శ్రీనివాస్, గడ్డం శ్రీనివాస్, పొన్నం లక్ష్మణ్, ఆడెపు దశరథం, మిడిదొడ్డి ప్రవీణ్, గుడికందుల శివ, సురేష్, ఉదయ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

గోదావరిఖని, సెప్టెంబరు 20: గోదావరిఖని సింగరేణి ఏరియా ఆసుపత్రిని శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై డిప్యూటీ సీఎంఓ కిరణ్‌రాజ్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని ఐసీయూ, జనరల్ వార్డు, కొత్త టెక్నాలజీ నడుస్తున్న ల్యాబ్, బ్లడ్ బ్యాంకులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు మరిన్ని మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. ఆయన వెంట ఏసీఎంఓ కిరణ్ రాజ్‌కుమార్ ఉన్నారు.



సింగరేణి ఆసుపత్రిని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్రీహర్ష

కార్పొరేషన్‌లో కలెక్టర్ తనిఖీలు

కోల్‌సిటీ, సెప్టెంబరు 20: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం కలెక్టర్ కోయ శ్రీహర్ష తనిఖీ నిర్వహించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను పరిశీలించారు. మధ్యాహ్న భోజనానికి వెళ్లిన ఉద్యోగులు సమయానికి రాకపోవడంతో పలు విభాగాలు ఖాళీగా దర్శనమిచ్చాయి. దీంతో కలెక్టర్ ఉద్యోగులను మందలించారు. సిబ్బంది, ఉద్యోగులు, అధికారులు సమయపాలన పాటించాలని, తప్పకుండా విధుల్లో ఉండలన్నారు. లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు.

వయో శ్రేష్ఠ సమ్మాన్ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 20 : అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని అక్టోబర్ 1న వివిధ రంగాల్లో విశేష కృషి, ప్రతిభచూపిన 60 ఏళ్లు పైబడిన వారు, వయోవృద్ధులకు సేవలు, సంక్షేమం కోసం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సంస్థలకు అవార్డు ఇవ్వనున్నట్లు జిల్లా సంక్షేమ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ కేటగిరిల్లో వయో శ్రేష్ఠ సమ్మాన్ అవార్డుతో కేంద్ర ప్రభుత్వం సత్కరిస్తుందని, ఇతర వివరాలకు 9440852495 ఫోన్ నంబర్లో సంప్రదించాలని వారు కోరారు.

దూర విద్యలో అడ్మిషన్లకు..

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 20: కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రంలో డిగ్రీ, పీజీ చేసేందుకు ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నట్లు దూర విద్య కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వి.రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అడ్మిషన్లకు చివరి తేది ఈనెల 30అని పేర్కొన్నారు. డిగ్రీలో చేరడానికి ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణులై ఉండాలని, పీజీ కోర్సులు చేయడానికి డిగ్రీ పాసైన వారికి అవకాశమని తెలిపారు. దూర ప్రాంతాల వారు కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కలదని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 8341385000 సెల్‌ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్జీ-1 ఏరియా కార్యవర్గం

కోల్‌సిటీటౌన్, సెప్టెంబరు 20: ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ 1630/1982 ఆర్జీ-1 ఏరియా నూతన కమిటీ శుక్రవారం ఎన్నికయ్యింది. ఏరియా కార్యదర్శిగా ఆకునూరి రాజశేఖర్, దుర్గం శంకర్, ఏరియా ఇంచార్జీగా ముడుసు రమేష్, ఆర్గనైజర్‌సెక్రెటరీగా దుర్గం తిరుపతి, 11 ఇంక్లయిన్ పిట్ సెక్రటరీగా జంజర్ల కళ్యాణ్ ఎన్నికయ్యారు. వైస్ ప్రెసిడెంట్ జనగామ నర్సయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నిక కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి గంగారం లింగమూర్తి,కేంద్ర వైస్‌ప్రెసిడెంట్ బడికెల కృష్ణ, ఓసీ-5 పిట్ సెక్రెటరీ కనుకుంట్ల శంకర్, రాము, దాట్ల ఉమేందర్, రాజు, రాజేష్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఇల్లందకుంట, సెప్టెంబరు 20: మండలంలోని మల్రివానిపల్లె గ్రామంలో బైక్ అదుపు తప్పి కింద పడిపోయిన యువకుడు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం మిర్జంపేట గ్రామానికి చెందిన మండ సురేష్ (35) జమ్మికుంట మండలంలోని కొత్తపల్లిలో ప్రైవేట్ కారు నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. గురువారం సాయంత్రం కొత్తపల్లి నుంచి బైక్‌పై తన బంధువుల ఇంటికి ఇల్లందకుంట మండలంలోని మల్రివానిపల్లె గ్రామం మీదుగా వెళ్తున్నాడు. గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి కింద పడ్డాడు. గమనించిన స్థానికులు 108 వాహనంలో వరంగల్ ఎంజీఎం తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. సురేష్ తల్లి వీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజకుమార్ తెలిపారు.

పశువులను తరలిస్తున్న వ్యాన్ పట్టివేత



గోశాలకు తరలించిన పశువులు

చిగురుమామిడి, సెప్టెంబరు 20: మండలంలోని కొండాపూర్ గ్రామ శివారులో శుక్రవారం అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్(టీజీ07 యూ 2943)ను పట్టుకున్నట్లు ఎస్సై బండి రాజేశ్ తెలిపారు. కొండాపూర్ గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ వ్యాన్‌లో ఐదు ఎద్దులు, మూడు ఆవులు, రెండు దూడలు ఉన్నాయి. వ్యాన్ డ్రైవర్ సాధిక్ ఖురేషిని విచారించగా పశువులను హుస్నాబాద్ సంతలో కొనుగోలు చేసి హైదారాబాద్‌కు తరలిస్తున్నట్లు చెప్పాడని తెలిపారు. దీంతో అక్రమంగా పశువులను తరలిస్తున్న వ్యాన్‌ను సీజ్ చేసి, డ్రైవర్‌తో పాటు యజమాని సాజిద్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు. పశువులను గ్రామంలో ఉన్న గోశా లకు తరలించామని తెలిపారు.

గీత కార్మికుడికి గాయాలు



గాయపడ్డ కుమారస్వామి

హుజూరాబాద్‌రూరల్, సెప్టెంబరు 20: మండలంలోని కాట్రపల్లి గ్రామానికి చెందిన తాడూరి కుమారస్వామి గురువారం ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఛాతి, కడుపు, భుజం భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

మానసిక దివ్యాంగులకు తోడ్పాటునందించాలి



ప్రిన్సిపాల్‌కు చెక్కును అందజేస్తున్న నరహరి

తిమ్మాపూర్, సెప్టెంబరు 20: మానసిక దివ్యాంగులకు మనవంతుగా తోడ్పాటునందిస్తూ ఇతరులకు స్ఫూర్తి నివ్వాలని మధ్యప్రదేశ్ రాష్ట్ర పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ ప్రిన్సిపాల్ సెక్రటరీ కమిషనర్ పరికిపండ్ల నరహరి అన్నారు. మండలంలోని మహాత్మానగర్‌లో స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మానసిక దివ్యాంగుల పాఠశా లను శుక్రవారం నరహరి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటుగా ఇతర జిల్లాలో కూడా ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నిజమైనా సహాయార్థులకు సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకొస్తున్న తమ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆలయ ఫౌండేషన్‌కు ఆర్థికంగా సహాయ, సహకారం అందిస్తున్న వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్‌రెడ్డి సహకా రంతో పాఠశాలకు సంబంధించిన సామగ్రి కోసం అవసరమైన 30వేల రూపాయల చెక్‌ను ప్రిన్సిపాల్ సతీష్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండేషన్ సీఈవో తిట్ల రమేశ్, మిట్టపెల్లి రాజేందర్, సుగుర్తి జగదీశ్వరాచారి, కళ్యాణ్ చంద్రశేఖర్, ఉమేశ్వర్, పి రామ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికను వేధించిన ఒకరి రిమాండ్

వీణవంక, సెప్టెంబరు 20: ఓ బాలికను లైంగికంగా వేధించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. వీణవంక మండలానికి చెందిన బాలిక(11)ను వేధించడంతో పాటు అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

న్యూస్ బాక్స్

నియామకం



మధుజాన్సన్

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబర్ 20: ఉమ్మడి జిల్లా జూనియర్ కళాశాలల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) కార్యదర్శిగా గుమ్మడి మధు జాన్సన్ నియమితులయ్యారు. ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ జూనియర్ కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న మధు జాన్సన్‌ను 2023-2024 సంవత్సరానికి క్రీడా సమాఖ్య కార్యదర్శిగా నియమిస్తూ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి జి జగన్మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా మధు జాన్సన్‌ను సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వి సత్యవర్థన్‌రావు, వి ఆంజనేయరావు, బి మదన్‌మోహన్‌రావు, ఎ నిర్మల, ఆల్ఫోర్స్ చైర్మన్ వి నరేందర్‌రెడ్డి, జిజెఎల్ అధ్యక్షుడు శశిధర్‌శర్మ, ఒలింపిక్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం

సైదాపూర్, సెప్టెంబరు 20 : సైదాపూర్ మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న రసాయనశాస్త్రం అధ్యాపక పోస్ట్ (పీజీటీ- కెమిస్ట్రీ) నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి(హెచ్ బీటీ) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బండారి సంపత్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు సంబంధింత సబ్జెక్టులో పోస్ట్ గ్రాడ్యుయేషన్, బీఈడీ చేసి టెట్ క్వాలిఫై అయి ఉండాలని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు బోధన ఆధారంగా గరిష్ఠంగా 18,200 రూపాయల వేతనం ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు వివరాలకు బండారి సంపత్‌కుమార్ 9014964242 నంబరులో సంప్రదించాలని సూచించారు.

పెరటి కోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం



లబ్ధిదారులకు పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న డీన్ దాసరి శ్రీనివాస్

రామడుగు, సెప్టెంబరు 20: వ్యవసాయానికి అనుబంధంగా పెరటి కోళ్ల పెంపకం చేపట్టి అదనపు ఆదాయం పొందాలని కోరుట్ల వెటర్నరి కాలేజ్ డీన్ డాక్టర్ దాసరి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని షానగర్, శ్రీరాములపల్లి, రామడుగు గ్రామాల్లోని వందమందికి శుక్రవారం పీవీఎన్ఆర్ వెటర్నరి యూనివర్సిటీ కోరుట్ల వెటర్నరి కాలేజ్ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాల సబ్‌ప్లాన్‌లో భాగంగా ఎస్సీ లబ్ధిదారులకు పెరటి కోడి పిల్లలను పంపిణీ చేశారు. డీవీఏహెచ్‌వో కార్యాలయ ఏడీ డాక్టర్ వినోద్‌కుమార్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రాంబాబు ఉన్నారు.

నలుగురు ఉపాధ్యాయులకు షోకాజ్ నోటీసులు

మానకొండూర్, సెప్టెంబరు 20: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన నలుగురు ఉపాధ్యాయులకు జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు శుక్రవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మండలంలోని వెల్ది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 19న మానకొండూర్, శంకరపట్నం మండలాలకు చెందిన తెలుగు భాషోపాధ్యాయ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం ఉన్నందున తొమ్మిది గంటలకు హాజరు కావాలని ఆదేశాలు ఉన్నాయి. కాగా మండలంలోని మండలంలోని శ్రీనివాస్‌నగర్‌లోని కేజీబీవీ పాఠశాల ఉపాధ్యాయురాలు కే రాజేశ్వరీ, అన్నారం ఉన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు కే శ్రీవాణి, పచ్చునూర్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు జి అంబిక, ఈదులగట్టెపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు కే యువరాజు 10.20గంటలకు హాజరయ్యారు. దీంతో వీరందరికి డీఈవో షోకాజ్ నోటీసులు జారీ చేసి రెండు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని ఆదేశించారు.

సిధారెడ్డికి 'తెలంగాణ తెలుగు తేజం'
జాతీయ పురస్కారం

• తెలంగాణ భాషకు పట్టం కట్టిన సిధారెడ్డి • పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్



నందిని సిధారెడ్డికి జాతీయ పురస్కారాన్ని అందజేస్తున్న అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్‌లాల్, తదితరులు

కరీంనగర్ కల్చరల్, సెప్టెంబర్ 20 : ప్రముఖ కవి, రచయిత, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ డాక్టర్ నందిని సిధారెడ్డికి బుర్ర నరసమ్మ లింగారెడ్డి స్మారక 'తెలంగాణ తెలుగు తేజం' జాతీయ పురస్కారాన్ని శుక్రవారం కరీంనగర్‌లో అందజేశారు. వాగీశ్వరి డిగ్రీ కళాశాలలో తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పురస్కార గ్రహీత సిధారెడ్డి మాట్లాడారు. బాధలు-గాయాలే కవిత్వాన్ని పండిస్తాయన్నారు. మట్టి వాసనలే సాహిత్య ఊటలకు ప్రేరణలని. అమ్మానాన్నల దీవెనలే మన అస్తిత్వమని అన్నారు. జీవితంలో అనుభవించే కన్నీళ్లే సాహితీవేత్తలకు సిరా చుక్కలని పేర్కొన్నారు. కష్టాల లోతుల్లోంచి జీవిత సత్యాలుకవిత్వ రూపంలో ఉబుకుతాయని అన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన పెద్దపల్లి జిల్లా అడిషనల్ కలెక్టర్ జీవి శ్యాంప్రసాద్ లాల్ మాట్లాడుతూ సమాజహితం కోరే సాహితీవేత్తలు తమ రచనలతో ప్రజలను మేల్కొలుపుతూ నిస్వార్థంగా అక్షర సేద్యం చేస్తున్నారని అన్నారు. సిధారెడ్డి నిస్వార్థ నిరాడంబర నిక్కచ్చి జీవితం నేటి యువతకు దారి దీపంగా నిలుస్తుందని కొనియాడారు. తన అమ్మానాన్నల పేరిట జాతీయస్థాయి పురస్కారం అందిస్తున్న డాక్టర్ మధుసూదనరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో నేటి నిజం దినపత్రిక సంపాదకుడు బైస దేవదాసు, విమర్శకుడు, రచయిత దాస్యం సేనాధిపతి, సాహితీ గౌతమి అధ్యక్షుడు నంది శ్రీనివాస్ సంస్థ అధ్యక్షుడు, పురస్కార ప్రదాత డాక్టర్ బుర్ర మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

కుల గణన తర్వాతనే వర్గీకరణ జరగాలి



అభివాదం చేస్తున్న బేడబుడిగ జంగాల హక్కుల పోరాట సమితి నాయకులు

సుభాష్‌నగర్, సెప్టెంబరు 20 : కుల గణన చేసిన తరువాతనే వర్గీకరణ జరగాలని తెలంగాణ బెడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు సిరపాటి వేణు డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో రాష్ట్రస్థాయి సమా వేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిరపాటి వేణు మాట్లాడారు. మాల మాది గలతో కలపకుండా బెడ బుడగ జంగాల ఉప కులాలను ఏ జాబితాలో చేర్చాలని, తమకు ఐదుశాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎస్సీ ఉపకులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మెనిఫెస్టోలో పేర్కొందన్నారు. దానిని అమలు చేయాలని, చైర్మన్‌గా బెడ బుడగ జంగాలనే నియమించాలని, పదివేల కోట్ల రూపాయల నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. అంబేడ్కర్ అభయహస్తం పేరుతో రూ. 12లక్షలు ఇస్తామని ప్రకటించిందని, దానిని వెంటనే అమలు చేసి, 40శాతం బెడ బుడగ జంగాలకు కేటాయించాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసిన తరువాత జనాభా ధామాష ప్రకారం బేడ బుడగ జంగాలకు రాబోయే రోజుల్లో రెండు ఎమ్మెల్యే స్థానాలు కేటాయిం చాల న్నారు. బెడబుడగ జంగాలకు చెందిన వ్యక్తికి ఎమ్మెల్సీగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. బెడబుడగ జంగాలకు ఇందిరమ్మ ఇళ్లను అందించాలని, 50 సంవత్సరాలు నిండిన వారికి నెలకు రూ. 12వేల ఫించను ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావే శంలో గౌరవాధ్యక్షుడు తురుపాటి లింగ య్య, ప్రధాన కార్యదర్శి పస్తం అంజనేయులు, రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు పాశర్లపూడి లక్ష్మి, పస్తం పరశురాములు, డొక్క రాజేశ్, పత్తి బాషశివ, మొటం నాగార్జున, మొటం రాములు తదితరులు పాల్గొన్నారు.

అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులు..
మనస్తాపంతో ఒకరి ఆత్మహత్య

గన్నేరువరం, సెప్టెంబరు 20 : మండల కేంద్రంలో అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులు భరించలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ తాండ్ర నరేష్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన మంగళారపు రాయమల్లు(55)కు ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ఇద్దరు కూతుళ్లకు వివా హం చేశాడు. రాయమల్లుకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో అదే గ్రామానికి చెందిన పుల్లెల తిరు పతి వద్ద గతంలో లక్షా యాభైవేల రూపాయలను అప్పుగా తీసుకున్నాడు. అప్పు తీర్చాలని రాయ మల్లుపై తిరుపతి పలుమార్లు ఒత్తిడి తెచ్చాడు. ఈ క్రమంలో పుల్లెల తిరుపతి ఖాళీ బాండ్ పేపర్‌పైన రాయమల్లు సంతకం తీసుకున్నాడు. ఆ తరువాత ఖాళీ బాండ్ పేపర్‌లో రాయమల్లుకు చెందిన వ్యవసాయ భూమిని అమ్మినట్లుగా ఇందుకు ఐదు లక్షలు ముట్టినట్లుగా మరో లక్ష ఇస్తే భూమిని రిజిస్ట్రేషన్ చేయాలని బాండ్ పేపర్‌లో రాసుకున్నారు. రాయమల్లు తీసుకున్న లక్షా యాభైవేల అప్పును కొద్ది నెలల క్రితమే పుల్లెల తిరుపతికి చెల్లించాడు. అప్పు చెల్లించినా పుల్లెల తిరుపతి, అతడి బంధువులు పుల్లెల అంజనేయులు, దొగ్గలి అనసూర్య, దొగ్గలి ప్రదీప్ అనే రాయమల్లును భూమి రిజిస్ట్రేషన్ చేయమని వేధింపు లకు గురి చేశారు. దీంతో మనస్తాపానికి గురైన రాయమల్లు గురువారం రాత్రి తన ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్‌లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకు న్నాడు. ఖాళీ బాండ్ పేపర్‌పై సంతకం చేయించు కొని మోసం చేయడమే కాకుండా భూమి పట్టా చేయాలని పుల్లెల తిరుపతి, పుల్లెల ఆంజనేయులు, దొగ్గలి అనసూర్య, దొగ్గలి ప్రదీప్ వేధించడంతోనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నట్లు రాయమల్లు భార్య రమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్ తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు స్వల్పంగా వరద



జగిత్యాల, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి శుక్రవారం వరద నీరు స్వల్పంగా వస్తోంది. ఎస్సారెస్పీలోకి 8,895 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి కాలువలు, ఇతర అవసరాలకు ప్రాజెక్టు నుంచి 8,895 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

మహిళ ఆత్మహత్యా యత్నం
- అడ్డుకున్న హోంగార్డు

జమ్మికుంట, సెప్టెంబర్ 20: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శుక్రవారం ఓ మహిళ పురుగుల మందు తాగేందుకు ప్రయత్నించింది. అక్కడే విధుల్లో ఉన్న హోంగార్డు అడ్డుకోవడంతో ప్రాణపాయం తప్పింది. వీణవంక మండలం పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ అత్తింటి వారు వేధిస్తున్నారనే నెపంతో ఇటీవల మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లి గ్రామంలోని తల్లిగారి ఇంటికి వెళ్లింది. తల్లి సైతం మందలించడంతో పురుగుల మందు డబ్బాతో జమ్మికుంట బస్టాండ్‌కు చేరుకుంది. ప్రయాణికులు చూస్తుండగానే పురుగుల మందు డబ్బా మూత తీసి తాగేందుకు ప్రయత్నించింది. అక్కడే విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు ఆమె వద్ద పురుగుల మందు డబ్బా లాక్కోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చాడు. అక్కడకు చేరుకున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది మహిళను స్టేషన్‌కు తీసుకు వెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం మహిళ తల్లిని పిలిపించి అప్పగించారు.

భవనం పైనుంచి దూకిన కేజీబీవీ విద్యార్థిని
తీవ్ర గాయాలు

వీర్నపల్లి/ఎల్లారెడ్డిపేట, సెప్టెంబరు 20: పాఠశాలలో ఉండలేనని రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని పర్లపల్లి అశ్విత శుక్రవారం రాత్రి పాఠశాల భవనం పైనుంచి దూకింది. ఈ సంఘటనలో విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. బాలికను పాఠశాల సిబ్బంది హుటాహుటిన ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వీర్నపల్లి మండలం జంజేరు గ్రామానికి చెందిన అశ్విత మండల కేంద్రంలోని కేజీబీవీలో ఆరో తరగతి నుంచి చదువుతోంది. కొంత కాలంగా తాను పాఠశాలలో ఉండనంటూ తల్లిదండ్రులకు చెబుతోంది. ఈ క్రమంలో శుక్రవారం తరగతులు ముగిసిన అనంతరం భవనం మొదటి అంతస్తు పైకి వెళ్లి కిందకు దూకింది. నడుముకు బలమైన గాయాలవడంతో ఎల్లారెడ్డిపేట ఆస్పత్రికి తరలించారు. అడిషనల్ కలెక్టర్ భీమ్యానాయక్ విద్యార్థిని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. విద్యార్థినికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పాఠశాల, హాస్టల్‌లో విద్యార్థినులు ఏం చేస్తున్నారో గమనించకపోతే ఎలా అంటూ పాఠశాల ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి ఎస్‌ఐ రమాకాంత్, ఎల్లాగౌడ్ వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లాలో వరుస సంఘటనలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు.



చికిత్స పొందుతున్న అశ్విత

ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసం
టీషర్ట్స్ బుక్ చేస్తే ఖాళీ బాక్స్

ఇల్లందకుంట, సెప్టెంబరు 20 : అమెజాన్ ఆన్‌లైన్ షాపింగ్‌లో రూ. 548 విలువ చేసే టీషర్ట్స్ బుక్ చేస్తే వట్టికి స్టిక్కర్ బొమ్మ వేసి డెలివరీ చేసిన సంఘటన ఇల్ల ందకుంట మండలం సిరిసేడు గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. బాధితుడు రహ్మాన్‌ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం. రూ. 548 విలువ చేసే టీషర్ట్స్ బుక్ చేయగా వాటికి బదులుగా ఖాళీ వట్టికి స్టిక్కర్లు వేసి డెలివరీ చేశారు. తను చేసిన టీషర్ట్స్ ఇంత చిన్న పరిమాణంలో ఉంటాయాన్న అనుమానంతో ప్యాకెట్ విప్పలేదు. దీనిపై అమెజాన్ యాప్‌లో ఐటమ్ రిటర్న్ పెట్టాడు. కొరియర్ బాయ్ రావడంతో అతని ముందే ప్యాకింగ్ ఓపెన్ చేశాడు. అందులో స్టిక్కర్ బొమ్మ వచ్చిందని బాధితుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. వినియోగదారుల ఫోరంలో కేసు వేయనున్నట్లు తెలిపాడు.



ఆన్‌లైన్‌లో వచ్చిన అట్టను చూపుతున్న బాధితుడు రహ్మాన్‌ఖాన్

టీబీ నివారణపై అవగాహన

చందుర్తి, సెప్టెంబర్ 20: చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మల్యాల, సనుగుల సబ్ సెంటర్‌లో టీబీ నివారణపై శుక్రవారం ఆరోగ్య సిబ్బందికి టీబీ అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్ ఇంపాక్ట్ ప్రోగ్రామ్ జిల్లా అధికారి దండుబోయిన శ్రీనివాస్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచంలోనే అధిక సంఖ్యలో కేసులు మన ఇండియాలోనే నమోదు అవుతున్నాయన్నారు. దీని ద్వారా మరణాల సంఖ్య అధికంగా ఉందన్నారు. టీబీ అనే మహమ్మారిని ప్రజల నుంచి దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ఐదు జిల్లాలను ఎంపిక చేసిందని అందులో రాజన్న సిరిసిల్ల జిల్లా ఒకటని అన్నారు. టీబీ బారిన పడి ఆ వ్యాధిని జయించిన వారిని టీబీ చాంపియన్‌గా గుర్తించి వారికి శిక్షణ నిర్వహించి, వారి ద్వారా వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఓ శశికల, ఎంఎల్‌హెచ్‌పిలు డాక్టర్ ఐశ్వర్య, నవీన్, సూపర్వైజర్ గంగాధర్, ఏఎన్ఎంలు రమాదేవి, పద్మ, మమత, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



సనుగులను సందర్శించిన టీబి అలర్ట్ ఇండియా ఆర్గనైజేషన్

రేపు కరీంనగర్ హాఫ్ మారథాన్
3కె, 5కె,10కె,21కె విభాగాల్లో నిర్వహణ



కరీంనగర్ హాఫ్ మారథాన్ టీ షర్ట్‌లను ఓపెన్‌చేస్తున్న నిర్వాహకులు

కరీంనగర్ స్పోర్ట్స్, సెప్టెంబర్ 20: కరీంనగర్ రన్నర్స్ సైక్లిస్ట్‌ల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22న కరీంనగర్‌లో రెండవ ఎడిషన్ కరీంనగర్ హాఫ్ మారథాన్ నిర్వహించనున్నట్లు మారథాన్ కమిటీ అధ్యక్షుడు పసుల మహేశ్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మారథాన్ వివరాలను వెల్లడించారు.

రన్ ఫర్ హెల్త్, సే నో టు డ్రగ్స్ అనే నినాదంతోపాటు కరీంనగర్ ప్రజలకు ఫిట్‌నెస్‌పై అవగాహన ఆరోగ్యం లక్ష్యంగా హాఫ్ మారథాన్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ మారథాన్‌లో మూడు కిలో మీటర్లు, 5,10, 21 కిలో మీటర్ల విభాగాల్లో నాలుగు కేటగిరీలుగా నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లా యంత్రాంగం పోలీసు కమిషనరేట్, టూరిజంల ఆధ్వర్యంలో నిర్వహిసున్న ఈ మారథాన్‌లో పాల్గొనేందుకు ఇప్పటి వరకు 5వేల మంది తమ పేర్లను నమోదు చేసుకున్నారని తెలిపారు. వారిని మాత్రమే మారథాన్‌లో పాల్గొనేందుకు అనుమతిస్తామని చెప్పారు. అంబేద్కర్ స్టేడియం నుంచి ప్రారంభమై భగత్‌నగర్, కలెక్టరేట్, ప్రతిమ మల్టిప్లెక్స్, తెలంగాణచౌక్, పద్మనగర్ మీదుగా ఎల్ఎండీ నుంచి తిరిగి అంబేద్కర్ స్టేడియం వరకు సాగుతుందని తెలిపారు. ఈ మారథాన్‌లో పాల్గొనే వారందరికి టీషర్ట్స్‌ను అందజేస్తామని మహేశ్ తెలిపారు. ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మారథాన్ ప్రారంభమవుతుందని, పురుషులు, మహిళలు పాల్గొనే ఈ మారథాన్‌లో 21కె విభాగంలో ఫస్ట్ ప్రైజ్ 10వేలు, సెకండ్ ప్రైజ్ 7వేల 500, థర్డ్ ప్రైజ్‌గా 5వేలు, 10కె విభాగంలో ఫస్ట్ ప్రైజ్ 7వేలు, సెకండ్ ప్రైజ్ 5వేలు, థర్డ్ ప్రైజ్‌గా 3వేలతో పాటు మెమోంటోలు అందజేయడం జరుగుతుందని అన్నారు. అనంతరం టీషర్ట్స్‌ను విడుదల చేశారు. సమావేశంలో జిల్లా క్రీడాధికారి శ్రీనివాస్‌గౌడ్, మార్కెటింగ్ డిడి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ క్రిమిలేయర్‌కు వ్యతిరేకంగా పోరాటం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్సీ ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి నాయకులు

సుభాష్‌నగర్ ; సెప్టెంబరు 20: ఎస్సీ, ఎస్టీ, వర్గీకరణ, క్రిమిలేయర్ అమలుకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జాతీయ చైర్మన్, దళిత బహుజనపార్టీ జాతీయ అధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణ స్వరూప్ పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్‌తో కలిసి ఏర్పాటుచేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. నరేంద్రమోదీ ప్రభుత్వం, కాంగ్రెస్, మనువాద పార్టీలు కలిసి కుట్రలు చేస్తున్నాయన్నారు. సుప్రీంకోర్టులో వందకుపైగా రివ్యూ పిటిషన్‌లు పెండింగ్‌లో ఉండగా రేవంత్ సర్కార్ వర్గీకరణకు కమిటీ వేయడం సిగ్గుచేటన్నారు. కమిటీని వెంటనే రద్దుచేయాలన్నారు. సెప్టెంబరు 30న ఛలో హైదరాబాద్ సచివాలయం ముట్టడికి తరలి రావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు పసుల రాజలింగం, ఆర్ల రమేష్, యనమల మంజుల, బద్దం డేనియల్, రాగి రాజేష్, తీగల శేఖర్, శ్రీని వాస్, నిచ్చికోల రాంచందర్, లింగాల జలపతి, చిప్పరి కరుణాకర్, పిట్ల ఈశ్వర్, దుగుట రాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఫిట్స్‌తో ఇంటర్ విద్యార్థి మృతి

మడికొండ, సెప్టెంబరు 20: ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇంటర్మీడి యేట్ విద్యార్థి మృతి చెందాడు. హనుమకొండ జిల్లా మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా చిగురు మామిడి మండలం నవాబుపేటకు చెందిన బుర్ర మల్లేశం కుమారుడు బుర్ర రామ్‌చరణ్(18) కాజీపేట మండలం భట్టుపల్లిలోని సిగ్మా జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శుక్రవారం ఉదయం కళాశాల ఉపాధ్యాయుడు ముద్దం సంతోష్ ఫోన్‌చేసి తమ కుమారుడికి ఫిట్స్ రావడంతో ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతున్నాడని ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని వెంటనే ఎంజీఎం ఆస్పత్రికి రావాలని తెలిపాడు. ఆస్పత్రికి చేరుకున్న తమకు అప్పటికే కుమారుడు మృతి చెందాడని తెలిపారు. మృతుడి తండ్రి మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి..

ధర్మపురి, సెప్టెంబరు 20: ధర్మపురి మండలంలోని రాయపట్నం సమీపంలో రోడ్డు పక్కన పడి ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని జగిత్యాల ఆసుపత్రికి తరలించగా శుక్రవారం సాయంత్రం మృతి చెందినట్లు ఎస్‌ఐ గంగుల మహేష్ తెలిపారు. సదరు వ్యక్తి 20 రోజుల నుంచి మతి స్థిమితం కోల్పోయి గ్రామంలో తిరుగుతుండేవాడు. 10 రోజుల క్రితం గ్రామ శివారులో రోడ్డు పక్కన పడి ఉండగా 108లో జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. సదరు వ్యక్తి మాట్లాడలేని స్థితిలో ఉండడంతో అతని వివరాలు తెలియలేదు. జగిత్యాల ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. రాయపట్నం గ్రామపంచాయతీ కార్యదర్శి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యుల వివరాలు తెలిస్తే పోలీసులకు తగు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

జ్వరంతో ఆరేళ్ల బాలుడి..

రాయికల్, సెప్టెంబరు 20 : రాయికల్ పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన రాస మనీష్ (6) అనే ఆరేళ్ల బాలుడు జ్వరంతో శుక్రవారం మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఇందిరానగర్ కాలనీకి చెందిన రాజశేఖర్-లాస్య దంపతులకు ఇద్దరు కవల పిల్లలు. నాలుగు రోజుల నుంచి ఇద్దరికీ జ్వరం రావడంతో జగిత్యాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. శుక్రవారం పెద్ద కుమారుడు మనీష్‌కు తీవ్ర జ్వరం రావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల నుంచి కరీంనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

బావిలోపడి రైతు..

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 : కరీంనగర్ రూరల్ మండలం నగునూర్‌కు చెందిన బోనగిరి సత్తయ్య(51) ప్రమాదవశాత్తుగా వ్యవసాయబావిలో పడి మృతి చెందాడు. కరీంనగర్ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తయ్యకు ఫిట్స్ వ్యాధి ఉండగా మందులు వాడుతున్నాడు. గురువారం తన వ్యవసాయబావి వద్దకు సత్తయ్య, అతడి భార్య వెళ్లారు. సాయంత్రం నాలుగు గంటలకు అతని భార్య ఇంటికి వెళ్లగా సత్తయ్య బావి వద్ద విద్యుత్ మోటార్ బంద్ చేసేందుకు వేచి ఉన్నాడు. ఈ సమయంలోనే మూర్ఛవచ్చి ప్రమాదవశాత్తు జారి బావిలోపడి మృతిచెంది ఉంటాడని మృతుడి భార్య పోలీసులకు ఫిర్యాదు చేసింది. గురువారం సాయంత్రం సత్తయ్య ఇంటికి రాకపోవటంతో బావి వద్ద వెతకగా అతని చెప్పులు కనిపించినట్లు ఫిర్యాదులో పేర్కొంది. శుక్రవారం ఉదయం బావిలోని నీటిని మోటార్ ద్వారా తోడగా బావిలో సత్తయ్య మృతదేహం కనపడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

కోనరావుపేట సెప్టెంబరు 20 : కోనరావుపేట మండలం మర్తన్‌పేట గ్రామానికి చెందిన కప్పభాను (50)అనే వడ్రంగి అప్పుల బాధతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. మర్తన్‌పేటకు చెందిన భాను సుమారు రూ.5 లక్షల వరకు వెచ్చించి కట్టె కోత మిషన్ కొనుగోలు చేశాడు. కట్టెపని దొరకకపోవడం, మిషన్‌కోసం చేసిన అప్పుల మిత్తి పెరగడంతో మనోవేదన గురయ్యా డు. ఈ క్రమంలోనే అప్పులు ఎలా తీర్చాలో తెలియక గురువారం రాత్రి దూలానికి ఉరేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు కోనరావుపేట ఎస్సై రాజశేఖర్ రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య బాలవ్వ కుమారులు వెంకటేష్, భూమేష్ ఉన్నారు.

కారును ఢీకొన్న లారీ

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 20 : జిల్లా కేంద్రం లోని కూనారం క్రాస్ రోడ్డు వద్ద కారును లారీ ఢీకొనడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసం కాగా, ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని స్థానికులు తెలిపారు. సంఘటన స్థలానికి ట్రాఫిక్ పోలీసులు చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

సిద్దిపేట సీఐ లక్ష్మిబాబు సస్పెన్షన్

కరీంనగర్ క్రైం, సెప్టెంబరు 20 : గతంలో కరీంనగర్‌లో సీఐగా పనిచేసిన సమయంలో ఒక కేసుకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ అనంతరం ప్రస్తుత సిద్దిపేట సీఐ లక్ష్మిబాబును సస్పెండ్ చేస్తూ శుక్రవారం నార్త్‌జోన్ ఐజీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఏడాది కిందట కరీంనగర్‌లోని పలు ఫైనాన్స్‌లపై పోలీసులు దాడులు నిర్వహించి నగదు, రికార్డులను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఈ సమయంలో కరీంనగర్‌లోని ఒక ఫైనాన్స్‌లో పోలీసుల దాడుల్లో లభ్యమైన డబ్బుల్లో 10 లక్షల నగదు తేడా రావటంతో ఈ వ్యవహారంపై సంబంధితులు ఐజీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ మేరకు ఐజీ ఆదేశాలతో కరీంనగర్ పోలీస్‌కమిషనర్ విచారణ నిర్వహించి, నివేదిక అందజేయగా ఉన్నతాధికారులు సస్పెన్షన్ వేటు వేశారని తెలిసింది.

గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభ్యం

జగిత్యాల క్రైం, సెప్టెంబరు 20 : జగిత్యాల జిల్లా కేంద్రంలోని చింతకుంట చెరువులో గురువారం ఒకరు గల్లంతుకాగా శుక్రవారం ఆచూకి లభ్యమైంది. ఆదిలాబాద్ జిల్లా ఊట్నూరుకు చెందిన సంపంగి శ్రీనివాస్(24) కొన్ని రోజులుగా జగిత్యాలలో తాపీ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గురువారం సాయంత్రం చింతకుంట చెరువులోకి ఈత కోసం వెళ్లి బయటకు రాకపోవడం స్థానికులు గమనించి డయల్ 100కు సమాచారం ఇచ్చారు. శుక్రవారం పోలీసులు జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టడంతో మృతదేహం లభ్యం కాగా కేసు నమోదు చేశామన్నారు.

సీసీ రోడ్డు పనులకు కొలతలు సేకరణ

సుల్తానాబాద్, సెప్టెంబరు 20 : సుల్తానాబాద్ పట్టణంలోని ట్యాంక్ రోడ్ నుంచి హనుమాన్‌నగర్ వరకు 715 మీటర్ల సీసీ రోడ్డు పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం మున్సిపల్ ఏఈ సతీష్, సిబ్బంది కొలతలను సేకరించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు పరిశీలించారు.

మొక్కలు నాటిన లయన్స్ క్లబ్ ప్రతినిధులు

సుల్తానాబాద్, సెప్టెంబరు 20 : సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ పరిధిలోని పూసాల శివసాయి ఇండస్ట్రీస్ ఆవరణలో క్లబ్ సభ్యులు మొక్కలను నాటారు. కార్యక్రమంలో జిల్లా చీఫ్ కోఆర్డినేటర్ వలస నీలయ్య, కోఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్, కోశాధికారి పూసాల సాంబమూర్తి, సభ్యులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

ఒడేడులో వైద్య శిబిరం

ముత్తారం, సెప్టెంబరు 20: మండలంలోని ఒడేడులో శుక్రవారం వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలో విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్యాధికారి అమరేందర్‌రావు ఆధ్వర్యంలో 106 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. గ్రామాల్లో శానిటైషన్, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పీ దీప్తి, ఎన్ఎంలు సునీత, సుజాత, సరితలు ఉన్నారు.

ఆగని ఇసుక అక్రమ రవాణా

సుల్తానాబాద్, సెప్టెంబరు 20 : మండలంలో ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. మండలంలోని గొల్లపల్లి గ్రామ శివారులో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్‌లను, దుబ్బపల్లి గ్రామంలో తొమ్మిది ఇసుక లారీలను పట్టుకున్నట్లు తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఇసుక అక్రమ రవాణా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షుడిగా రవి

ఓదెల, సెప్టెంబరు 20 : మండల కేంద్రంలోని రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద శుక్రవారం గీతా పారిశ్రామిక సంఘం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా కాంగ్రెస్ నేత నాగపురి రవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షుడిగా ముంజాల మహేందర్, సభ్యులుగా చింతల పర్శరామ్, నాగపురి పైడిద్ద రాజు, మాచర్ల శంకర్, గట్టు అనిల్, ముంజాల మధు, మార్క చందు, పోతుగంటి మహేష్‌తో పాటు పలువురు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు పచ్చిమట్ల శ్రీనివాస్ తో పాటు పలువురు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలి

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 20 : ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని పెద్దపల్లి ఎంపీవో ఫయాజ్ అన్నారు. శుక్రవారం మండలంలోని భోజన్నపేట, చీకురాయి గ్రామాల్లో ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తూ గ్రామపంచాయతీ కార్యాలయాల్లో స్టీల్ బ్యాంకును ఏర్పాటు చేయగా ఎంపీవో ఫయాజ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శైలజతో, బిల్ కలెక్టర్ రాధిక, కారోబార్ మల్లారపు మల్లేష్, సీఏలు స్వరూప, శ్రీవాణి, అంగన్‌వాడీ టీచర్ విజయ, ఆశా వర్కర్ మల్లారపు లక్ష్మీ, గ్రామస్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

పంటల పరిశీలన

మంథని, సెప్టెంబరు 20: మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లి, మండలంలోని బిట్టుపల్లి గ్రామాల్లో వరి, పత్తి పంటలను ఏడీఏ అంజలి, వ్యవసాయాధికారులు శుక్రవారం పరిశీలించారు. పంటలకు సోకే పలు తెగులు, వాటి నివారణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, వినియోగించే మందుల గురించి రైతులకు వివరించారు. సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు.

ముత్తారం : మండలంలోని ఒడేడు గ్రామంలోని వరి పంట పొలాలను శుక్రవారం ఏవో అనూష పరిశీలించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కంటే నత్రజని, ఎరువుల వాడకం ఎక్కువ కావడం వల్ల వరిలో బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు ఆశించినట్లు గుర్తించారు. తెగులు నివారణకు రైతులకు పలు సూచనలు చేశారు.

ఆశన్న పల్లెలో ఒకరికి డెంగ్యూ

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబరు 20: మండలంలోని ఆశన్నపల్లెకు చెందిన పెండ్లి సంధ్యకు డెంగ్యూ రాగా ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది. ఈ విషయమై స్పందించిన వైద్య సిబ్బంది శుక్రవారం గ్రామంలో సంధ్య ఇంటితోపాటు పలు చుట్టుపక్కల ఇళ్లలో వైద్య సిబ్బంది డ్రై డే నిర్వహించి స్ప్రే చేశారు. ఈ సందర్భంగా హెచ్ఈవో ఆరేపల్లి లక్ష్మణ్ మాట్లాడుతూ ఆ గ్రామంలో 52 ఇళ్లల్లో దోమల నివారణకు మందులతో స్ప్రే చేయించడంతో పాటు, నీటి గుంతలలో ఆయిల్ బాల్స్ వేశామన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి 108మంది గ్రామస్థులకు మందులు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శోభ, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం, మంత్రులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

గోదావరిఖని, సెప్టెంబరు 20: సింగరేణి ఉద్యోగులకు 33 శాతం లాభాల వాటా, కాంట్రాక్టు కార్మికులకు రూ.5వేల బోనస్‌ను ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ఇందుకోసం కృషి చేసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, సీతక్కలకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ కృతజ్ఞతలు తెలిపారు. రామగుండంలో జెన్‌కో స్థానంలో 800మెగవాట్ల విద్యుత్ ప్లాంట్, సంపుడ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్, సింగరేణి ఏరియా ఆసుపత్రిలో క్యాత్ ల్యాబ్‌తో పాటు క్యాంటీన్ల ఆధునీకరణ, రామగుండం సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి ప్రకటించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు సింగరేణి కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చారన్నారు.

రైతులకు ప్రయోజనకరంగా వ్యవసాయ పరపతి సంఘాలు

- రైతులను రాజులుగా చేయడమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యం - పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు

ఎలిగేడు, సెప్టెంబరు 20: వ్యవసాయ పరపతి సంఘాలు రైతులకు ప్రయోజనకరంగా ఉంటాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. శుక్రవారం ఎలిగేడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సర్వసభ్య సమావేశం చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు హాజరై ప్రసంగించారు. వ్యవసాయ పరపతి సంఘాలు రైతులకు ప్రయోజనకరంగా ఉంటాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేసిందని, ఆ ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కిందన్నారు. నిరంతరం రైతు సంక్షేమం కోసం పనిచేస్తున్నప్పటికీ బీఆర్ఎస్ నాయకులు పనిగట్టుకొని కాంగ్రెస్ పార్టీని బదనాం చేస్తున్నారని ఆరోపించారు. మిగులు బడ్జెట్ ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని విమర్శించారు. అబద్ధాల పునాదుల మీద పుట్టిందే బీఆర్ఎస్ పార్టీ అని ఎద్దేవా చేశారు. రైతుల పంట కొనుగోలు విషయంలో ప్రభుత్వానికి, రైతులకు సహకార సంఘాలు వారధిలాగా పనిచేస్తున్నాయని కొనియాడారు. గత పాలకుల హయాంలో పండించిన పంటలకు తరుగు పేరుతో మోసం చేసి కోట్లు గడించారని పేర్కొన్నారు. రైతులను రాజులుగా చేయడం కాంగ్రెస్ పార్టీ లక్ష్యం అని అందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు వడ్ల కొనుగోలులో గింజ కట్ చేయకుండా కాంటా వేయిస్తానని భరోసా ఇచ్చారు. పీఎస్‌సీఎస్ చైర్మన్ గోపు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సంఘంలో 1913మంది సభ్యులు ఉన్నారని వారి వాటా ధనం రూ.1,36,24,462 బ్యాంకులో ఉందని 2023-2024ఆడిట్ రిపోర్ట్ ప్రకారం సంఘం మొత్తం ఆదాయం రూ.56,47,091 నికరం ఆదాయం 15,82,040తో ఏ గ్రేడులో ఉంటుందన్నారు. సమావేశంలో తహసీల్దార్ బషీరోద్దీన్, ఎంపీడీఓ భాస్కర్‌రావు,



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఏవో ఉమాపతి, అసిస్టెంట్ సబ్‌రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు, బ్యాంకు మేనేజర్ రమేష్, మాజీ చైర్మన్ నరహరి సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు తాటిపల్లి రమేష్‌బాబు, కరివేద సుధాకర్‌రెడ్డి, ఏలేటి వెంకట్‌రెడ్డి, కొప్పర సత్తమ్మ, రెవెల్లి కనుకమ్మ, అసంపల్లి కమలమ్మ, రవి, దుగ్యాల రాజేశ్వర్‌రావు, దాసరి రాజిరెడ్డి, కొండ తిరుపతిగౌడ్, తీగల కనుకయ్య, తొంటి మధుకర్, సీఈవో విక్రమ్, సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 28మంది లబ్ధిదారులు రూ.28,03,248విలువగల చెక్కులను ఎమ్మెల్యే విజయరమణారావు పంపిణీ చేశారు.

ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందించిన ఉపాధ్యాయులు



విద్యార్థులను అభినందిస్తున్న నారాయణ స్కూల్ ప్రిన్సిపాల్ రజిని, వరుణ్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, ప్రణయ్‌ను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సయ్య

కోల్‌సిటీటౌన్, సెప్టెంబర్ 20: కరీంనగర్‌లో ఇటీవల జరిగిన ఆలిండియా ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీలలో గోదావరిఖని నారాయణ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనపర్చి పతకాలు సాధించారు. పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న పెగడ విధిత్, రాయపాటి మోక్షిత్, శివరాం చౌదరి, ఆకుల దేవాశిష్, అఖిలేష్‌యాదవ్‌లు కటాస్ విభాగంలో కాంస్య పతకాలు సాధించారు. పాఠశాలకు చెందిన విద్యార్థులు పతకాలు సాధించడం పట్ల శుక్రవారం ప్రిన్సిపల్ రజిని, ఉపాధ్యాయులు అభినందించారు.

కాల్వశ్రీరాంపూర్ : మండలంలోని పెగడపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న సీహెచ్ వరుణ్ కుమార్ ఈనెల 15న జరిగిన జిల్లా స్థాయి జూనియర్ ఇంటర్ సాఫ్ట్ బాల్ సెలక్షన్స్‌లో ప్రతిభ కనపరచి పెద్దపల్లి జిల్లా జట్టుకు ఎంపికయ్యాడు. ఈనెల 21 నుంచి 23 వరకు సిరిసిల్ల జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ సాఫ్ట్ బాల్ ఛాంపియన్‌షిప్ పోటీలో పాల్గొననున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కే కోటీశ్వరరావు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల నోడల్ అధికారి మహేష్, ఉపాధ్యాయులు కృష్ణమూర్తి, బీ కుమారస్వామి, సీఆర్‌పీ కుర్మశెట్టి చందర్‌లు వరుణ్ కుమార్‌ను అభినందించారు.

పెద్దపల్లి రూరల్ : పెద్దపల్లి మండలం పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి, ఎన్‌సీసీ కెడెట్ గుండా ప్రణయ్ హైదరాబాద్ ఆర్మీ అటాచ్‌మెంట్ క్యాంపులో షార్ట్‌పుట్‌లో రజత పతకం సాధించారు. ఈసందర్భంగా శుక్రవారం కళాశాలలో ప్రణయ్ అభినందన సభ నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా.కె. లక్ష్మీనర్సయ్య, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ కంజర్ల శ్రీలత, కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ డా.జి పురుషోత్తం, టీఎస్‌కేసీ కోఆర్డినేటర్ మారుతి, నారాయణ, సునిత, మురళి, శాలిని, ఆర్. సునితలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

'కేసులు నమోదైనా అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యమేంటి?'

మంథని, సెప్టెంబరు 20: అక్రమాలకు పాల్పడిన మంథని మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి ఇనుముల సతీష్ ఆగడాలపై పోలీసులు కేసులు నమోదు చేసినా ఇప్పటివరకు అరెస్టు చేయకపోవడంలో ఆంతర్యం ఏమిటని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మూడు కేసుల్లో ఏ-1గా ఉన్న ఇనుముల సతీష్‌ను అరెస్టు చేయకుండా అతనికి సంబంధించిన రెండు కేసుల్లో ఏ-2గా ఉన్న రావికంటి సతీష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపడంపై మంథని ప్రజల్లో ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత పోలీసులు, ప్రభుత్వంపై ఉందన్నారు. ఇనుముల సతీష్‌తో ఎప్పటికైనా కాంగ్రెస్ పార్టీకి ఇబ్బందని కేసుల పేరుతో బెదిరించి తమ చెప్పుచేతుల్లో పెట్టుకోవడానికి ఏ-2గా ఉన్న రావికంటి సతీష్‌ను బలిపశువును చేశారా, లేక ఇనుముల సతీష్‌ను కూడా అరెస్టు చేస్తారా అనే అంశాన్ని స్పష్టం చేయాల్సిన బాధ్యత మంత్రి శ్రీధర్‌బాబుపై ఉందన్నారు. పలు కేసులు నమోదైన ఇనుముల సతీష్‌పై కాంగ్రెస్ పార్టీ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఇనుముల సతీష్‌పై కేసుల అంశాన్ని తమ నేత పుట్ట మధు హస్తంఉందని దుష్ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. నేతలు మాచీడి రాజుగౌడ్, వేల్పుల గట్టయ్య, కాయితి సమ్మయ్య, మంథని లక్ష్మణ్, పెగడ శ్రీనివాస్, వేముల లక్ష్మయ్యలు పాల్గొన్నారు.

'30న చలో హైదరాబాద్'ను విజయవంతం చేయండి

కళ్యాణ్‌నగర్, సెప్టెంబరు 20: ఆటో అండ్ మోటార్ కార్మికుల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాలని ఐఎఫ్‌టీయూ మోటార్ వర్కర్స్ జిల్లా కార్యదర్శి ఎడ్ల రవికుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం గంగానగర్‌లోని లారీ యార్డు వద్ద ఛలో హైదరాబాద్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 30న తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కొమురయ్య, బాల కృష్ణ, రఘు, మహిపాల్, సదయ్య, గౌస్, లక్ష్మిపతి, నరేష్, గురుదత్త తదితరులు పాల్గొన్నారు.

రామగుండంలో స్వచ్ఛ హీ సేవా

కోల్‌సిటీ, సెప్టెంబరు 20: రామగుండం నగరపాలక సంస్థ పరిధిలో శుక్రవారం స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. కూరగాయల మార్కెట్‌లో వర్తకులతో కలిసి నగరపాలక పారిశుధ్య పర్యవేక్షకులు చీపుర్లతో శుభ్రం చేయించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ, ఎస్ఎస్ఎస్ వాలంటీర్లతో కలిసి శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రాజు, హెల్త్ అసిస్టెంట్ సునీల్ రాథోడ్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రి కళాశాలలో..

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 20 : పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ అల్లెంకి శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఎమ్ ఏ.సమద్, ప్రిన్సిపాల్ రవీందర్, లెక్చరర్స్ పాల్గొన్నారు.

అందుగులపల్లిలో..

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 20 : పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే రోగాలు దరిచేరకుండా ఉంటాయని పెద్దపల్లి ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఘనుకోట శ్రీధర్ అన్నారు. స్వచ్ఛ శుక్రవారం లో భాగంగా మండలంలోని అందుగులపల్లిలో పర్యటించారు. ఇంటింటా తిరుగుతూ పరిశుభ్రత పట్ల గ్రామస్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో రమేష్ బాబు, పంచాయతీ కార్యదర్శి ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సక్రమంగా విధులు నిర్వహిస్తే ఆటంకాలు రావు

- డీఎల్‌పీవో వేణుగోపాల్

పెద్దపల్లి రూరల్, సెప్టెంబరు 20 : ఉద్యోగులు సక్రమంగా విధులు నిర్వహిస్తే ఆటంకాలు రావని పెద్దపల్లి డీఎల్‌పీవో వేణుగోపాల్ అన్నారు. శుక్రవారం మండలంలోని రాఘవపూర్ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, బిల్ కలెక్టర్ అహ్మది బేగంలు బదిలీ కాగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎల్‌పీవో హాజరై వారిని సన్మానించారు. అనంతరం నూతనంగా విధుల్లో చేరిన తూముల రవికి స్వాగతం పలుకుతూ సన్మానించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగంలో బదిలీలు తప్పనిసరిగా ఉంటాయని, గ్రామా అభివృద్ధి లక్ష్యంగా పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వహించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వివిధ హోదాలో ఉద్యోగులు ఉద్యోగ రీత్యా గ్రామాల ప్రజలందరితో మమేకమై అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ముందుకు సాగాలన్నారు.

ఈ సందరంగా అంగన్వాడీ టీచర్‌లు, సీఏలు, ఫీల్డ్ అసిస్టెంట్ సంపత్‌లు బదిలీపై వెళుతున్న వారిని సన్మానించారు.

ఘనంగా అక్కినేని శతజయంతి ఉత్సవం

మంథని, సెప్టెంబరు 20: అక్కినేని నాగేశ్వర్‌రావు శత జయంతి ఉత్సవాలను మంథని విద్యార్థి యువత అధ్యక్షుడు కొండేల మారుతి ఆధ్వర్యంలో స్థానిక ఫ్రెండ్స్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఏఎన్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులను, గాయినీ, గాయకులను, వివిధ రంగాల్లో సేవలందించిన వారిని కొండేల మారుతి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అక్కినేని అభిమానులు, వివిధ రంగాలకు చెందిన వారు పాల్గొన్నారు.



శత జయంతి వేడుకల్లో పాల్గొన్న కళాకారులు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేత



కారుణ్య నియామక ఉత్తర్వులు అందిస్తున్న జీఎం

రామగిరి, సెప్టెంబరు 20: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్‌లో వివిధ కారణాలతో ఇన్వాలిడేషన్ అయిన 9 మంది డిపెండెంట్‌లకు శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో జీఎం సుధాకర్‌రావు చేతులమీదుగా కారుణ్య నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు నాగేశ్వర్‌రావు, సుదర్శనం, రాజేశం, క్రాంతి కిరణ్, నాయకులు రాంచందర్‌రావు, కోట రవీందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల పక్షాన సీఐటీయూ ఆందోళనలు

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 20: సింగరేణి కాంట్రాక్టుకార్మికులకు న్యాయమైన వేతనాలు, చట్టబద్ధమైన హక్కుల సాధనకు సీఐటీయూ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టనున్నట్టు సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం ఆర్జీ-2 గౌరవ అధ్యక్షుడు ఉల్లి మొగిలి పేర్కొన్నారు. శుక్రవారం ఓసీపీ-3లోని వివిధ సెక్షన్లలో డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని ఆయన విడుదల చేశారు. ఈసందర్భంగా ఉల్లి మొగిలి మాట్లాడారు. 30వేల మంది కాంట్రాక్టు కార్మికుల శ్రమకు తగిన వేతనాలు అందడం లేదని, యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులను చిన్నచూపు చూస్తున్నట్టు తెలిపారు. జీవో 22ను గెజిట్ చేయని కారణంగా కార్మికులు వేతనాలు పురగడం లేదన్నారు. లాభాల్లో కాంట్రాక్టు కార్మికులకు వాటా చెల్లించాలని, హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలనే డిమాండ్లతో ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు ఉల్లి మొగిలి పేర్కొన్నారు. ఈనెల 23 నుంచి 25 వరకు జీఎం కార్యాలయాల ఎదుట ధర్నాలు, 28న జిల్లా కలెక్టరేట్ ముట్టడి, 30న చలో హైదరాబాద్ ఆందోళనలకు కాంట్రాక్టు కార్మికులకు కలసి రావాలని మొగిలి పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమాల్లో సీహెచ్ లక్ష్మీనారాయణ, రాజేష్, రషీద్‌ఖాన్, రాజు, రవి, కిరణ్‌కుమార్, మల్లేష్‌తోపాటు పలువురు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

కాలనీలో స్వచ్ఛతా కార్యక్రమం

యైటింక్లయిన్‌కాలనీ, సెప్టెంబరు 20: స్వచ్ఛతా ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సింగరేణి యాజమాన్యం శుక్రవారం కాలనీ వారసంతలో చెత్త తొలగింపు కార్యక్రమా న్ని చేపట్టారు. ఆర్జీ-2 అఫీషియేటింగ్ ఎస్వోటూ జీఎం సంతోష్‌కుమార్ అధికారులతో కలిసి వారసంత ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు అన్ని ప్రభుత్వరంగ సంస్థలతో పాటు సింగరేణిలో స్వచ్ఛతా 4.0లో భాగంగా అవగాహన కార్యక్రమాలు చేయనున్నట్టు సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. పనిస్థలాల్లో పరిసరాల పరిశుభ్రత, కార్యాలయాలు, కాలనీల సుందరీకరణ వంటి ఏరియా పరిధిలో జరపనున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ నరసింహారావు, పర్యావరణ అధికారి సురేష్‌బాబు, సివిల్ ఈఈలు వినయ్‌సాగర్, ప్రతాపగిరి రాజు, ఎస్ఎస్ఓ మహమ్మద్ షరీఫ్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ వేణుగోపాల్, ఫారెస్ట్ ఆఫీసర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

మంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకం

రామగిరి, సెప్టెంబరు 20: స్థానిక ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో కాంట్రాక్టు కార్మిక సంఘం ఆర్జీ-3 ఉపాధ్యక్షుడు ఉడుత శంకర్ ఆధ్వర్యంలో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సింగరేణి సంస్థలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు 2023-24 ఆర్థిక సంవత్సరంలో లాభాల వాటాలో రూ.5 వేలు చెల్లించేందుకు సుముఖం వ్యక్తం చేయడంపై ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల గోదావరిఖనిలో జరిగిన సమా వేశంలో ఈ విషయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు, జనక్ ప్రసాద్‌ల దృష్టికి తీసికెళ్లగా సానుకూలంగా స్పందించి యాజమాన్యంతో మాట్లాడి కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేశారని ఉడుత శంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ఉపాధ్యక్షుడు కోట రవీందర్‌రెడ్డి, నాయకులు మల్లారెడ్డి, శ్రీనివాస్, మల్లయ్య, సందీప్, తదితరులు పాల్గొన్నారు.

పీఎం విశ్వకర్మ యోజన మొదటి వార్షికోత్సవం

పెద్దపల్లి టౌన్, సెప్టెంబరు 20: విశ్వకర్మ యోజన మొదటి వార్షికోత్సవంలో భాగంగా పెద్దపల్లిలో ఏర్పాటు చేసిన డేటా ప్రో శిక్షణ కేంద్రం అభ్యర్థులు శుక్రవారం ప్రధాని నరేంద్రమోదీ నిర్వహించిన వర్చువల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇందులో పాల్గొన్న 550మంది అభ్యర్థులకు ప్రధాని విశ్వకర్మ యోజన ప్రయోజనాలను వివరించారు. ఈ కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా శిక్షణ కేంద్రం మేనేజర్ పల్లికొండ నరేష్, విశ్వకర్మ యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు నారాయణ స్వామి, బీజేపీ నాయకులు పల్లె సదానందం, వెల్లంపల్లి శ్రీనివాసరావు, పెండ్యాల కుమార్, బండ కరుణాకర్, రాజం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ కోసం ఎంపీకి వినతి

ఓదెల, సెప్టెంబరు 20: మండలంలోని కొలనూర్ రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టింగ్ కోసం శుక్రవారం హైదరాబాద్‌లో గ్రామస్థుడు దండం రాజు రామచందర్‌రావు ఎంపీ వంశీ కృష్ణకు వినతిపత్రాన్ని సమర్పించారు. రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్ల సౌకర్యం సక్రమంగా లేక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అలాగే రైళ్ల హాల్టింగ్ చేయిస్తే రైల్వేకు వచ్చే లాభాలు, ఇతర గ్రామాల ప్రయాణికులకు చేకూరే సౌకర్యాలను వివరించారు. దీంతో ఎంపీ మాట్లాడుతూ, ఈ విషయం ఇంతకుముందే తన దృష్టికి వచ్చిందని ఎక్స్‌ప్రెస్ రైళ్లను కొలనూర్‌లో హాల్టింగ్ చేయించేందుకు కృషి చేస్తానని ఎంపీ హామీ ఇచ్చినట్లు రామచంద్రరావు విలేకరులకు తెలిపారు.

ప్రమాద నియంత్రణకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు



పొత్కపల్లి ఊర చెరువు మూలమలుపు వద్ద ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

ఓదెల, సెప్టెంబరు 20: ఎట్టకేలకు పొత్కపల్లిలో ప్రాణాపాయంగా ఉన్న ప్రధాన రహదారిలో వాహనదారులకు ఊరట లభించింది. గ్రామ ఊర చెరువు మూలమలుపు వద్ద ఇటీవల ప్రమాదాల నియంత్రణ కోసం పొత్కపల్లి యువకులు కలిసి స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద సూచికలు ఏర్పాటు చేశారు. గత నెలలో పొత్కపల్లి ఊర చెరువు మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఇంతకు ముందు ఇదే మూలమలుపు వద్ద ఎనిమిది రోడ్డు ప్రమాదాలు జరిగి పలువురు తీవ్ర గాయాలకు గురయ్యారు. ఎన్ని ప్రమాదాలు జరిగినా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించకపోవడంతో చివరికి పొత్కపల్లికి చెందిన యువకులు ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి, ప్రమాద సూచికలను ఏర్పాటు చేశారు. దీంతో వాహనదారులకు ఊరట లభించింది.

శిశుమరణాల రేటును తగ్గించడమే లక్ష్యం

సుల్తానాబాద్, సెప్టెంబరు 20: ఆడపిల్లల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుందని, ఆడపిల్లల రేటును పెంచడం, శిశు మరణాల రేటును తగ్గించడమే బేటి బచావో బేటి పడావో ముఖ్య ఉద్దేశమని జిల్లా మహిళ సాధికారత కేంద్రం కో ఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. శుక్రవారం మండలంలోని గర్రెపల్లి గురుకుల బాలికల కళాశాలలో మహిళ సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గర్రెపల్లి వీవో సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వివిధ రకాల హెల్ప్ లైన్ నంబర్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గిరిజా, జెండర్ స్పెషలిస్ట్ చంద్రు, స్వప్న, ఫైనాన్స్ లిట్రసీ సంధ్యారాణి, వైస్‌ప్రిన్సిపాల్ మంజుల, మెడికల్ ఆఫీసర్ మారుతి, ధనలక్ష్మి, ఆర్ జాహ్నవి, పీఈటి అంజలి, చైల్డ్ లైన్ కో ఆర్డినేటర్ ఉమాదేవి, సిసి అశోక్, వీవోఏ విజయ ఏఎన్ఎం జమున, కల్పన తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ జిల్లా సహాధ్యక్షుడిగా లక్ష్మణ్

పెద్దపల్లి కల్చరల్, సెప్టెంబరు 20 : పీఆర్‌టియూ జిల్లా సహాధ్యక్షుడిగా మంథని మండల కాకర్లపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు కోట లక్ష్మణ్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చొల్లేటి శ్రీనివాస్, పులిపాక కిషన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘం బలోపేతానికి కృషి చేయాలని లక్ష్మణ్‌కు సూచించారు. తన నియమకానికి సహకరించిన సంఘం వ్యవస్థాపకుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, కిషన్‌కు లక్ష్మణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

మంత్రి శ్రీధర్‌బాబు చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ముత్తారం, సెప్టెంబరు 20: రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి ఫైబర్ కేబుల్ ఇంటర్నెట్ కల్పించే నేపథ్యంలో పైలెట్ ప్రాజెక్టుగా తొలి దశలో మండలంలోని కాల్వశ్రీరాంపూర్ గ్రామాన్ని ఎంపిక చేయడాన్ని హర్షం ప్రకటిస్తూ శుక్రవారం ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటానికి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, నాయకులు వాజిద్‌పాషా, అల్లాడి యాదగిరి, దొడ్డ గీతారాణి, బక్కతట్ల వినీత్, గాదం శ్రీనివాస్, అల్లం కుమా రస్వామి, తూటి రజిత, రఫీ, శ్రీనివాస్, సంపత్‌రావు, కోలా విజయ్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ నాయకుల శ్రమదానం

ముత్తారం, సెప్టెంబరు 20: మండలంలోని పోతారం గ్రామంలో ప్రధాన రహదారి నుంచి గ్రామానికి వచ్చే రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్ల కొమ్మలను కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చెల్కల జితేందర్ ఆధ్వర్యంలో తొలగించారు. గోదావరిఖని నుంచి ఓడేడ్ వెళ్లే ఆర్టీసీ బస్సు ప్రతీరోజు గ్రామానికి వచ్చేది కానీ నాలుగు రోజుల క్రితం బస్ డ్రైవర్లు కొమ్మలు తగులుతున్నాయని తెలపగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రమదానం చేసి కొమ్మలను నరికి వేశారు. కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు నర్ర మల్లయ్య, యూత్ అధ్యక్షుడు నెత్తెట్ల కిరణ్, మాజీ ఎంపీటీసీ చెల్కల లింగా భవాని సుదీర్, మాజీ వార్డు సభ్యులు సిరారపు నరేష్, నాయకులు చెల్కల కిషన్, చెల్కల ఓదెలు, చెల్కల నరేందర్, నెత్తెట్ల శ్రావణ్, నాంసాని రమేశ్, నర్ర రాజేశ్, గుజ్జేటి వెంకటేశ్వర్లు, బత్తుల సదయ్య, స్వరూప పాల్గొన్నారు.

కృష్ణవేణి హెచ్ఎంకు డైమండ్ అచీవ్‌మెంట్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కృష్ణవేణి పాఠశాల హెచ్ఎం

రామగిరి, సెప్టెంబరు 20: విద్యార్థులకు మామూలు ఫీజులతో కార్పొరేట్ స్థాయి విద్య అందిస్తున్నట్లుగా గుర్తించి కృష్ణవేణి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బర్ల శ్రీనివాస్‌కు ఒలింపియాడ్ ఫౌండేషన్ కన్వీనర్ అరకాల రామచంద్రారెడ్డి డైమెండ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బర్ల శ్రీనివాస్, కరస్పాండెంట్ చందుపట్ల తిరుపతిరెడ్డికి అవార్డును అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో టీఆర్ఎమ్‌పఏ గౌరవ అధ్యక్షుడు అదర్‌సండే, సమ్మారావు, పాఠశాల డైరెక్టర్స్ శ్రీధర్‌బాబు, అనిల్‌కుమార్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.